# మన పండుగ దర్శన నిమిత్తం మాత్రమే పండుగ కాకూడదు.
# అల్లాహ్ హక్కులతో పాటు ప్రజల హక్కులు చెల్లిస్తు పండుగ కావలెను

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 06.06. 2025 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ ○ بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ అల్‌హజ్ అధ్యాయపు సూక్తులు 35-39 పఠించి వాటి అనువాదం వినిపించిన తర్వాత ఇట్లు ఉపదేశించారు.

ఈ పవిత్ర సూక్తుల మూలాంశంలో మనకు వివరించబడినది ఏమనగా బలిదానం అంటే కేవలం ఈదుల్ అజ్‌హా (బక్రీద్) సందర్భంగా జంతువులను బలి ఇచ్చినట్లు ఇతరుల నుండి త్యాగాన్ని ఆశించడం మాత్రమే కాదు. నిజానికి ఒక ఉన్నతమైన లక్ష్యం కోసం తక్కువ స్థాయి వస్తువును త్యాగం చేయాలని మీకు తెలియజేయడమే దీని ఉద్దేశ్యం. మిమ్మల్ని సృష్టించిన ఆ దేవుని కోసం మీరు కూడా త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండవలెను. అల్లాహ్ మీ నుండి కేవలం దైవభీతిని మాత్రమే ఆశిస్తున్నాడు. మీ హృదయాలలో అతని పట్ల భయం మరియు గౌరవం ఉండాలని, అతని ఆజ్ఞలను పాటిస్తూ అతని ప్రసన్నతను ఎలా పొందాలో అని, మీరు నిరంతరం శ్రమిస్తూనే ఉండాలని మాత్రమే అల్లాహ్ తఆలా కోరుకుంటున్నాడు.

ఈ రోజుల్లో పాకిస్థాన్‌లో అహ్మదియ్య జమాఅత్‌ను పశువులను బలిదానం ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు మరియు గత కొన్ని సంవత్సరాలుగా మనల్ని పండుగ సందర్భంగా బలిదానం ఇవ్వకుండా ఆపడం జరుగుతోంది. అయితే అసలైన విషయం దైవభీతి. అనగా ఒకవేళ బలిదానం ఇవ్వకుండా మనల్ని వారు నివారించినా మనం ఏ ఉద్దేశంతో ఖుర్బానీ చేయాలనుకుంటున్నామో అల్లాహ్‌కు మన మనసులోని ఆ సంకల్పం తెలుసు. మనం దైవభీతిపై నడుస్తూ ఖుర్బానీ చేయాలని సంకల్పించుకుంటే, ఆ ఖుర్బానీ చేయలేకపోయినప్పటికీ అల్లాహ్ తఆలా మన త్యాగాలను అంగీకరిస్తాడు. కేవలం ప్రదర్శన కోసం ఖుర్బానీలు చేసేవారి త్యాగాలలో నిష్టాపరత ఉండదు. అటువంటి వారు అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తున్నారా? ప్రజల హక్కులను కాలరాయమని అల్లాహ్ తఆలా ఆజ్ఞాపించాడా? ప్రజలపై అన్యాయం చేయమని లేదా వారిని అల్లాహ్ తఆలాను ఆరాధించకుండా అడ్డుకోమని అల్లాహ్ తఆలా చెబుతున్నాడా?

అల్లాహ్ తఆలా ఇటువంటి ఆజ్ఞలను ఎప్పుడూ ఇవ్వలేదు.

అల్లాహ్ తఆలా 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు) అని పలికిన ప్రతి ఒక్కరినీ ముస్లిం అని ప్రకటించాడు. కానీ ఈ రోజుల్లో పాకిస్థాన్‌లో అహ్మదీల పట్ల వీరు చేస్తున్న పనులు దైవానికి దూరం చేసే విషయాలు. ఇది ముమ్మాటికీ అన్యాయం. అయినప్పటికీ ఈ త్యాగాలు అల్లాహ్ తఆలా సామీప్యాన్ని పొందేందుకేనని మనం అర్థం చేసుకోవడం మన బాధ్యత. అందుకే ఒకవేళ మనం బలిదానం ఇవ్వలేకపోయినా అల్లాహ్ తఆలా దానిని తప్పక అంగీకరిస్తాడు. ఎందుకంటే, 'మీ త్యాగాల మాంసం కానీ, రక్తం కానీ నా వరకు చేరవు, కేవలం మీ దైవభీతి మాత్రమే నా వరకు చేరుతుంది' అని అల్లాహ్ తఆలా ఆదేశించాడు.

హుజూరె అన్వర్ ఇంకా ఇట్లనిరి. మీ జన్మ ఉద్దేశం అల్లాహ్ హక్కులను నెరవేర్చడం మరియు అతణ్ణి ఆరాధించడమని అల్లాహ్ తఆలా స్పష్టంగా ఆదేశించాడు. ఇందులో అన్నిటికంటే మొదటిది నమాజ్‌ను జమాఅత్‌తో (సామూహికంగా) సలుపడం. ఈ రోజుల్లో అన్ని వైపుల నుండి కష్టాలు, ఆంక్షలు ఎదురవుతున్నప్పుడు, మన నమాజ్‌లను మునుపటి కంటే ఎక్కువగా రక్షించుకోవడం మన బాధ్యత. బలిదానిమివ్వబడే జంతువు ఎలాగైతే తపిస్తుందో అలాగే మనం కూడా అల్లాహ్ సన్నిధిలో కన్నీరు మున్నీరుగా విలపిస్తూ దుఆలు (ప్రార్థనలు) చేయవలెను. మన క్రియలు ఈ విధంగా ఉండ వలెను. ముఖ్యంగా పాకిస్థాన్‌లో నివసిస్తున్న అహ్మదీలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించవలెను. మనం నమాజ్‌లను ఏదో బాధ్యత తీరిపోయింది అన్నట్లుగా కాకుండా వాటి హక్కును నెరవేరుస్తూ సలుపవలెను. నమాజ్‌లను జమాఅత్‌తో మరియు అత్యంత శ్రద్ధతో చక్కగా నిర్వహించవలెను.

హుజూరె అన్వర్ ఇంకా ఇట్లనిరి. నేడు మనం మన ఆరాధనల ప్రమాణాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేద్దాం. పాకిస్థాన్‌లో బహుశా మనకు పండుగ నమాజ్ చదువుకోవడానికి అనుమతి లభించకపోవచ్చు, యంత్రాంగం తరపున ఆంక్షలు విధించబడవచ్చు లేదా ఇప్పటికే విధించి ఉండవచ్చు. కానీ మనం వాటిని లెక్కచేయకూడదు మరియు మన హృదయాలలో నిరాశకు చోటు ఇవ్వకూడదు. నిస్సందేహంగా మీ ఇళ్లలోనే పండుగ నమాజ్ చదువుకోండి. అయితే అల్లాహ్ తఆలా ఆరాధన మరియు అతని సేవకుల (ప్రజల) హక్కులను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయండి. నమాజ్ హక్కును నెరవేర్చడానికి మనం పూర్తిస్థాయిలో ప్రయత్నించవలెను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు. ప్రార్థన (ఆరాధన)లో రెండు భాగాలు ఉన్నాయి. **ఒకటి:** మనిషి అల్లాహ్‌కు భయపడటం, అతనికి ఎంతలా భయపడాలో అంతటి భక్తిశ్రద్ధలతో భయపడటం. రెండవ భాగం: మనిషి అల్లాహ్‌ను ప్రేమించడం, అతణ్ణి ఎంతగా ప్రేమించాలో అంతటి గాఢంగా ప్రేమించడం.

హుజూరె అన్వర్ ఇంకా ఇట్లనిరి. ఇస్లాం ఈ రెండు ఆజ్ఞలను (భయం మరియు ప్రేమ)

నెరవేర్చడానికి ఒక మార్గంగా నమాజ్‌ను నిర్ణయించింది. ఇందులో దైవభీతి అనే అంశం దాగి ఉంది. **రెండవది:** ప్రేమను వ్యక్తపరచడానికి హజ్‌ను మార్గంగా చేయబడెను. అహ్మదీలను వారి విశ్వాసం నుండి దూరం చేయాలన్నదే శత్రువుల ప్రయత్నం. కానీ వారు ఇందులో ఎప్పటికీ విజయం సాధించలేరు. ఎవరి హృదయంలోనైతే దృఢమైన విశ్వాసం ఉంటుందో అటువంటి బలమైన అహ్మదీ వారి అన్యాయాలకు భయపడి ఎన్నడూ వెనకడుగు వేయడు. ప్రస్తుతం మనం మన ఆరాధనల ప్రమాణాలను మరింత మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించవలెను.

విదేశాలలో బంధువులు ఉన్న పాకిస్థానీ అహ్మదీలు చాలా మంది ఉన్నారు. ఒకవేళ వారు పాకిస్థాన్‌లో పశువులను బలిదానం ఇవ్వలేకపోతే, బయట దేశాల్లో ఉన్న తమ బంధువుల ద్వారా ఖుర్బానీలు చేయించవచ్చు. ఆఫ్రికాలోని పేద దేశాలలో కూడా ఖుర్బానీ చేయించవచ్చు. ఖుర్బానీ చేయకుండా అడ్డుకుంటే, అల్లాహ్ తఆలా ఖుర్బానీ చేయడానికి ఇతర మార్గాలను కూడా ఇచ్చాడు. పేదవారిని ఆదుకోవాలని, వారికి అన్నదానం చేయాలని, వారి అవసరాలను చూసుకోవాలని అల్లాహ్ తఆలా ఆదేశించాడు. అల్లాహ్ హజ్‌తో పాటు ఖుర్బానీని ఉంచాడు, కానీ ఖుర్బానీ చేయడానికి మరిన్ని అవకాశాలు కూడా ఉన్నాయి, వాటిని ఉపయోగించుకోవలెను. అలాగే సమయం మరియు ధనం ద్వారా కూడా త్యాగం (ఖుర్బానీ) ఉంది. దాని కోసం కూడా పూర్తిస్థాయిలో కృషి చేయవలెను. చివరగా అల్లాహ్ ఏ పనులనైతే నివారించాడో, వాటికి దూరంగా ఉండటం కూడా ఒక రకమైన త్యాగమే.

ఆ తర్వాత ప్రజల హక్కులు కూడా చాలా ముఖ్యమైనవి. వీటిలో భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు మరియు బంధువులందరి హక్కులు ఉంటాయి. అలాగే పొరుగువారి మరియు ఇరుగుపొరుగు వారి హక్కులు కూడా ఉన్నాయి. వీరందరినీ మనం జాగ్రత్తగా చూసుకోవాలి. ఇస్లాం శత్రువుల హక్కులను కూడా నిర్ణయించింది, ఇలాగే ముస్లిమేతరులకు కూడా హక్కులను కల్పించింది. మనం గనుక ఇతరుల పట్ల మన బాధ్యతలను పూర్తిగా నెరవేరిస్తే, ఆ పనులే కొన్నిసార్లు ఆరాధనల రూపాన్ని సంతరించు కుంటాయి. అటువంటప్పుడు మనల్ని ఆరాధనలు చేయకుండా అడ్డుకున్నా పెద్ద తేడా ఉండదు. కేవలం మీరు మేకను బలి ఇచ్చినంత మాత్రాన అల్లాహ్ సంతోషించడు, కానీ ఇతరుల పట్ల మీ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చినప్పుడు మాత్రమే అల్లాహ్ నిజంగా ప్రసన్నుడవుతాడు.

హదీసులో ఇలా ఉంది. మీలో ఎవరైనా సరే, తన సోదరుని కోసం కూడా తాను ఇష్టపడే దానినే ఇష్టపడే వరకు అతను పరిపూర్ణ విశ్వాసి కాలేడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు. మీరు విశ్వాసం పొందే వరకు స్వర్గంలో ప్రవేశించలేరు మరియు మీరు ఒకరినొకరు ప్రేమించుకునే వరకు మీరు పరిపూర్ణ విశ్వాసులు కాలేరు.

కావున అహ్మదీలు తమ మధ్య ఉన్న మనస్పర్థలన్నింటినీ తొలగించుకోవాలి. అప్పుడే మనం పరలోకంలో స్వర్గానికి వారసులం అవ్వడమే కాకుండా, ఈ ప్రపంచంలో కూడా స్వర్గం వంటి సమాజాన్ని

నిర్మించగలం. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో, అహ్మదీలందరూ తమ విభేదాలను పక్కన పెట్టి ఒక అందమైన సమాజానికి పునాది వేయవలెను. తద్వారా ప్రత్యర్థులు ఏ విధంగానూ మన శ్రేణులను విచ్ఛిన్నం చేయలేరు. మనలో నిష్టాపరత, దైవభీతి కలిగినప్పుడే మనం అల్లాహ్ తఆలా సామీప్యాన్ని పొందగలుగుతాము. అప్పుడు ఒకవేళ (పరిస్థితుల ప్రభావంతో) బలిదానం ఇవ్వలేకపోయినా, మనం బలిదానం ఇచ్చిన వారముగానే పరిగణించబడతాము.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. మన పవిత్ర ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్మించిన జమాఅత్‌లోని ప్రతి ఒక్కరూ పవిత్రమైన ఆత్మ కలవారు మరియు ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను ధర్మం కోసం త్యాగం చేసిన వారు. వారిలో కపటమైన జీవితాన్ని గడిపే వారు ఒక్కరు కూడా లేరు.

హుజూరె అన్వర్ ఇలా ప్రార్థించారు. మన పండుగ కేవలం ప్రదర్శన కోసం జరుపుకునే పండుగలా కాకుండా అల్లాహ్ తఆలా హక్కులను, ప్రజల హక్కులను నెరవేర్చే పండుగగా అల్లాహ్ మార్చుగాక. మనం అల్లాహ్ తఆలా అనుగ్రహాలను నిరంతరం పొందే వారిగా మారుదాం. ప్రార్థనలు (దుఆలు) చేయండి! మీ దుఆలలో త్యాగాలు చేసిన అమరవీరుల పిల్లలను కూడా గుర్తుంచుకోండి. అల్లాహ్ తఆలా వారిని, వారి తరాలను తన రక్షణలో ఉంచుకొనుగాక.

జైలులో ఉన్నవారందరి కోసం కూడా ప్రార్థించండి. ముఖ్యంగా పాకిస్థాన్‌లో చట్టపరంగా విధించిన అనేక ఆంక్షలను అల్లాహ్ తఆలా తొలగించాలని, మనం బహిరంగంగా, నిజాయితీగా ఆరాధనలు చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించాలని దుఆ చేయండి. అన్ని అడ్డంకులు తొలగిపోయి, మనం స్వేచ్ఛగా పశువుల బలిదానాలు కూడా చేయగలగాలి. అల్లాహ్ తఆలా మనకు అటువంటి విజ్ఞతను ప్రసాదించి, ఈ త్యాగాల వెనుక ఉన్న అసలైన స్ఫూర్తిని అర్థం చేసుకునేలా చేయుగాక!

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సందర్భంగా ఈ ఖుత్బా వింటున్న వారందరికీ మరియు ఇక్కడ కూర్చున్న వారందరికీ నేను పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అల్లాహ్ తఆలా ఈ పండుగను శుభప్రదంగా చేయుగాక!

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔